www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 నవంబర్ 2024

5

కాకినాడ

పంపా నదిలో ఊరేగిన సత్యదేవుడు

ప్రజాశక్తి - శంఖవరం


కనువిందు చేసిన హంస వాహనం

అన్నవరం పంపా అలలపై లాహిరి లాహిరి లాహిరి అంటూ సత్యదేవుడు సతీసమేతంగా ఊరేగారు. బుధవారం రాత్రి స్వామి వారిని సతీసమేతంగా, కొండపై నుంచి కొండ దిగువన గల పంప ఘాటు వద్దకు తోడుకుని వచ్చి అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఆశీనులు గావించారు, దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్, ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ సమక్షంలో విద్యుత్ కాంతులతో ఏర్పాటుచేసిన హంస వాహనంపై ఊరేగించారు.

ర్యాగింగ్ నిరోధక కమిటీల జాడేదీ..?

- పురి విప్పిన ర్యాగింగ్ సంస్కృతి
- ఆర్ఎంసిలో విద్యార్థుల భయాందోళన
- కొరవడిన అవగాహన కార్యక్రమాలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఇటీవల కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ(ఆర్ఎంసి)లో ర్యాగింగ్ కలకలం రేపింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనతో పలువురు విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హౌస్ సర్జన్‌గా చేస్తున్న శ్రీకాకుళానికి చెందిన ఒక వైద్య విద్యార్థి ఫుల్లుగా మద్యం సేవించి మెన్స్ హాస్టల్లో పది మంది విద్యార్థులను ర్యాగింగ్ చేసినట్లుగా ఆలస్యంగా బయటపడింది. దీంతో కాలేజి ప్రిన్సిపల్‌కు తల్లీదండ్రులు ఫిర్యాదు చేయడంతో ర్యాగింగ్‌కు పాల్పడిన వైద్య విద్యార్థిని సస్పెండ్ చేశారు. ఈ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఉన్నప్పటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా కొరవడంతో ర్యాగింగ్ భూతం విద్యార్థులను వెంటాడుతూనే ఉంది.

నిరోధక కమిటీలు ఏం చేస్తున్నాయి.?

ఉన్నత విద్యాసంస్థల్లో ర్యాగింగ్ భూతం మళ్లీ పెచ్చుమీరుతోంది. ప్రతి కళాశాలలో స్థానిక పోలీసు అధికారిని సభ్యుడిగా చేస్తూ ర్యాగింగ్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలి. ప్రతి కళాశాల, హాస్టళ్లలో నోటీసు బోర్డులను ఏర్పాటు చేసి ర్యాగింగ్ చేస్తే తీసుకోబోయే చట్టపరమైన చర్యలు, శిక్షలు వివరాలను ఉంచాలి. ఫిర్యాదుల బాక్స్‌లను ఏర్పాటు చేయాలి. ర్యాగింగ్‌కు పాల్పడబోమని విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి హామీ పత్రాలను తీసుకోవాలి. కళాశాల యాజమాన్యం తరచూ విద్యార్థులతో సమావేశమై దిశానిర్దేశం చేయాలి. అయితే పలు విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు, రాత్రి నిఘా పెట్టాల్సిన స్క్వాడ్లు నిస్తేజంగా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పలువురు విద్యార్థులు వికృత చేష్టలకు అడ్రస్ అవుతున్నారు. జూనియర్ విద్యార్థులపై సీనియర్లు దాడులకు తెగబడుతున్నారు. కాలేజీల్లో యాజమాన్యాలు యాంటీ ర్యాగింగ్ గ్రూపులు, స్క్వాడ్‌ను ఏర్పాటు చేసినా ఈ ర్యాగింగ్ మాత్రం ఆగడం లేదు. ఇదే ఇప్పుడు కొత్తగా కాలేజీలో చేరిన విద్యార్థులను ఆందోళన కలిగిస్తోంది. గతంలో కాకినాడ జెఎన్‌టియు క్యాంపస్ కళాశాల హాస్టల్లో ర్యాగింగ్ భూతం కలకలం రేపింది. బిటెక్ 3వ సంవత్సరం చదువుతున్న కొంతమంది సీనియర్ విద్యార్థులు మొదటి సంవత్సరం చదువుతున్న జూనియర్ విద్యార్థులను వేధించిన సంఘటతో అందరూ ఉలిక్కి పడ్డారు. సీనియర్లు ర్యాగింగ్ చేస్తున్నారని అప్పట్లో సీఎం క్యాంపు కార్యాలయానికి సైతం ఫిర్యాదులు అందాయి. విచారణ అనంతరం ఇంటరాక్షన్ పేరుతో ర్యాగింగ్‌కు పాల్పడిన 11 మందిని రెండు నెలల పాటు హాస్టల్ నుంచి, 15 రోజులు తరగతుల నుంచి సస్పెండ్ చేశారు. అయితే ఇక్కడ కళాశాలలో 9 మంది ప్రొఫెసర్లతో యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ పనిచేస్తున్నా విద్యార్థులపై పర్యవేక్షణ లేకపోవడం శోచనీయమని అప్పట్లో విద్యార్థి సంఘాలు విమర్శించాయి.

పర్యవేక్షణ గాలికి.?

కాకినాడ రంగరాయ కళాశాల క్యాంపస్‌లో పర్యవేక్షణ పూర్తిగా గాలికి వదిలేసినట్లు తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. సమయం, సందర్భం లేకుండా కొందరు విద్యార్థులు ఇష్టారాజ్యంగా బయట తిరుగుతున్నా కనీసం పట్టించుకునే నాథులు లేరని ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత ఉన్నతాధికారుల పర్యవేక్షణ, అజమాయిషీ లేకపోవడంతోనే ర్యాగింగ్ వంటి సంస్కృతి పడగ విప్పిందని స్థానికులు వాపోతున్నారు.

యాంటీ ర్యాగింగ్ కమిటీలు వేయాలి

విద్యాసంస్థల్లో ర్యాగింగ్ అరికట్టడం కోసం పోలీసుల సహకారంతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసులతో ప్రతి ఏడాది యాంటీ ర్యాగింగ్ కమిటీలు వేయాలి. పతి విద్యాసంస్థలో ర్యాగింగ్ వల్ల జరిగే అనర్థాలు, ర్యాగింగ్ చేస్తే ఎటువంటి శిక్షలు పడతాయనే అంశాలపై అవగాహన కార్యక్రమాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి. ర్యాగింగ్ జరిగిన తర్వాత అధికారులు స్పందిస్తున్నారు. తక్షణం విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ కమిటీలు వేయాలి.

-ఎం. సూరిబాబు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

స్నేహాభావంతో మెలగాలి

ఎంతో పేరు ప్రఖ్యాతలు కలిగిన కొన్ని విద్యాసంస్థల్లో ర్యాగింగ్ భూతం నేటికీ వెంటాడుతూనే ఉంది. కొన్ని వెలుగులోకి వస్తున్నప్పటికీ చాలా అంశాలు బయటకు పొక్కడం లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు మంచి విలువలతో కూడిన విద్యను అభ్యసించడానికి ప్రయత్నించాలి. ర్యాగింగ్ విషసంస్కృతి వలలో పడి చదువులను నాశనం చేసుకోవద్దు. అందరూ స్నేహాభావంతో మెలగాలి.

-సంతోష్ కుమార్, ఇంజనీరింగ్ విద్యార్థి, కాకినాడ

సాగునీటి సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

రబీలో పూర్తి ఆయకట్టుకు సాగునీరు

పంపా ఆయకట్టులో అపరాలకే పరిమితం
సాగునీటి సలహా మండలి నిర్ణయం

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో గోదావరి తూర్పు డెల్టా, పిఠాపురం బ్రాంచి కెనాల్, ఏలేరు రిజర్వాయర్ వ్యవస్థల కింద ఉన్న ఆయకట్టుకు రబీలో పూర్తి స్థాయిలో సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. 2024-25 రబీ సీజనులో ఫసలీ-1434 పంటలకు పూర్తి ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేసేందుకు జిల్లా సాగునీటి సలహా మండలి తీర్మానించింది. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ఇ జి.శ్రీనివాస్ గోదావరి, ఏలేరు ఇరిగేషన్ వ్యవస్థలలో ప్రస్తుతం ఉన్న నీటి నిల్వ పరిమాణాలను వివరిం చారు. ఈ వ్యవస్థల కింద పూర్తి ఆయకట్టుకు రబీ సీజనులో సాగునీరు అందించేందుకు తగిన నిల్వలు ఉన్నాయని తెలిపారు. గోదావరి తూర్పు డెల్టా పరిధిలోని 1,05,341 ఎకరాలు, పిఠాపురం బ్రాంచి కెనాల్ కింద 32,507 ఎకరాలు, ఏలేరు రిజర్వాయర్ కింద 53,017 ఎకరాలు వెరసి 1,90,865 ఎకరాల ఆయకట్టుకు రబీ సాగునీరు అందించేందుకు ఆయన ప్రతిపాదించగా కలెక్టర్ ఆమోదం తెలిపారు. వచ్చే డిశంబరు 1 నుంచి ప్రారంభమైయ్యే రబీ సీజనులో ఆయకట్టుల రైతులు డిశంబరు-31వ తేదీ నాటికి నాట్లు వేసుకుని, 2025 మార్చి 31 లోగా పంటలను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. రబీ పంటలకు నీటి విడుదల లోపు జిల్లాలోని సాగునీటి వ్యవస్థల పటిష్టత కొరకు రూ. 6 కోట్ల నిధులతో మంజూరు చేసిన పనులన్నింటినీ పూర్తి చేసి, బిల్లులు ఆమోదం కొరకు సమర్పించాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా జిల్లాలోని సమ్మర్ స్టోరేజిలన్నింటిని డిసెంబరులో ఒకసారి, మార్చిలో మరోసారి పూర్తి స్థాయిలో నింపాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. పంపా రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టుకు సాగునీటి సరఫరా ఉండదని అన్నారు. పంపా ఎగువన ఉన్న అక్విడెక్ట్‌ను పూర్తి చేయాల్సివుందని, అలాగే ఇటీవల వచ్చిన వరదలతో దెబ్బతిన్న ప్రాంతాల్లో మరమ్మతు పనులు చేపట్టాల్సివున్నందున సాగునీటిని విడుదల చేయలేమని ఆయన స్పష్టం చేశారు. కావున రైతులు అపరాల సాగును మాత్రమే చేసుకోవాలని, అందుకు అవసరమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అందుకు రైతులను సన్నద్ధం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో కాకినాడ, పెద్దాపురం ఆర్‌డిఒలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, పోలవరం ఎల్ఎంసి ఎస్ఇ పి.ఏసుబాబు, ఏలేరు ఇరిగేషన్ డివిజన్ ఇఇ జి.శేషగిరిరావు, వ్యవసాయ శాఖ జెడి ఎన్.విజయకుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ తగదు

కాకినాడ రూరల్: నగరంలో ప్రధాన పార్కులు, బీచ్‌ను ప్రయివేటీకరణ చేయడం తగదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు బుధవారం ఒక ప్రకటనలో అన్నారు. నగరంలో పార్కులను ప్రయివేటీకరణ చేసేందుకు స్మార్ట్ సిటీ కంపెనీ ప్రణాళిక డాక్యుమెంట్‌తో సిద్ధంగా ఉందన్నారు. పార్కులతోపాటు, సముద్ర తీరాన్ని సైతం ప్రయివేటీకరణ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు సరి కాదన్నారు. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలకు పార్కులు, సముద్ర తీరం మినహా మరో ఆహ్లాదకర ప్రదేశం లేదన్నారు. పార్కులు, బీచ్‌లను ప్రయివేటీకరణ చేస్తే వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

ప్రజలపై భారాలు మోపుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - పెద్దాపురం, యు.కొత్తపల్లి

పెద్దాపురం ప్రజాపోరులో ప్రచారం చేస్తున్న నాయకులు

ప్రజా పోరు యాత్రలో భాగంగా బుధవారం పెద్దాపురం మండల సిపిఎం కమిటీ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్‌రోడ్డులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు నీలపాల సూరిబాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపుతూ ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తుందని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు చేతినిండా పని లేక అవస్థలు పడుతున్నారన్నారు. పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 14వ తేదీన మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, దారపురెడ్డి కృష్ణ, నెక్కల నరసింహమూర్తి, కూనిరెడ్డి అప్పన్న, గడిగట్ల సత్తిబాబు, దారపురెడ్డి క్రాంతికుమార్, డి.సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే యు.కొత్తపల్లి మండలం ఎండపల్లిలో కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు పలు సమస్యలను సిపిఎం దృష్టికి తీసుకొచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా పోరు కార్యక్రమాన్ని సిపిఎం చేపట్టిందని అన్నారు. 18వ తేదీన జరిగే ధర్నాలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు గుర్రాల అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం సిపిఎం ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా ఎండపల్లి గ్రామంలో కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు చీకట్ల సాంబశివకుమార్, సత్యనారాయణ, డి సోమరాజు, పి.విజయ్, వి.గంగాధర్, సూరిబాబు, సింహాచలం, ఎ.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

25 నుంచి 108 ఉద్యోగుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - కాకినాడ

డిఆర్ఒకు వినతిపత్రం ఇస్తున్నయూనియన్ నాయకులు

ఈ నెల 25వ తేదీ నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం 108 ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగనున్నారు. ఈ మేరకు బుధవారం డిఆర్ఒ జె.వెంకటరావు, డిఎంహెచ్ఒ నరసింహనాయక్‌లకు సంఘం నాయకులు సమ్మె నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా 108 ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు చెక్కల రాజ్‌కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పివివి.సత్యన్నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా 108 నిర్వహణ సంస్థలు మారుతున్నాయని, ఈ సందర్భంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఆర్జిత సెలవులు, గ్రాడ్యుటి, పెండింగ్ బిల్లులు, వేతనాలు చెల్లించకుండా ఎగ్గొడుతూ ఉద్యోగులకు నష్టం చేస్తున్నాయని అన్నారు. అంబులెన్సు మరమ్మతుల ఖర్చులను ఉద్యోగుల జీతాల నుంచి కోత పెడుతున్నారని, సరిపడా సిబ్బంది లేక సెలవులు మంజూరు చేయకుండా ఉద్యోగి యొక్క వ్యక్తిగత జీవితాన్ని హరిస్తున్నారన్నారు. రోజుకు 12 గంటలు పని చేయించుకుంటూ కార్మిక చట్టాలకు తూట్లు పొడుస్తూ అదనపు పనికి అదనపు వేతనం చెల్లించడం లేదని అన్నారు. వీటిపై ప్రభుత్వ ఉన్నత అధికారులకు అనేక దఫాలుగా వినతిపత్రాలు సమర్పించినా సమస్యలు పరిష్కారం కాకపోవడంతో నిరవధిక సమ్మెకు వెళ్లాల్సిన పరిస్థితులకు రాష్ట్ర ప్రభుత్వమే కారణమని అన్నారు. 108 వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించి, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెండింగ్ బిల్లులు, వేతనాలు ఆర్జిత సెలవులకు అరవింద సంస్థ నుంచి ఉద్యోగులకు చెల్లించే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 4 ఏళ్ల నుంచి బకాయి పెట్టిన 40 శాతం ఇంక్రిమెంట్ చెల్లించాలని, ఎనిమిది గంటల పని విధానాన్ని 108 వ్యవస్థలో అమలు చేయాలని, ప్రభుత్వ నియామకాల్లో 108 ఉద్యోగులకు వెయిటేజీ కల్పించాలని, వేతనాల స్లాబ్ విధానాన్ని తక్షణమే అమలు చేయాలని, ప్రతీనెలా 5 వతేది లోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ఉదయ్ భాను, ఆర్.శేఖర్, సూర్య చంద్ర పాల్గొన్నారు

సాంస్కృతిక, క్రీడా రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

చిన్ననాటి నుంచి విద్యతో పాటు సాంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ రాణించాలని చిల్డ్రన్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బుద్దా శ్రీనివాస్ అన్నారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం జానపద నృత్య పోటీలు నిర్వహించారు. చిల్డ్రన్స్ క్లబ్ అధ్యక్షులు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని వివిధ జానపద కళారూపాలు ప్రదర్శించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ కార్యదర్శి రొంగల అరుణ్‌కుమార్, దారపురెడ్డి కృష్ణ, కె.పవన్‌కుమార్, ఎ.ధర్మ, మంజుల పాల్గొన్నారు.

సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - గండేపల్లి

ఉపాధి హామీ పథకం సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎంపిడిఒ నాతి బుజ్జి అన్నార. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంద రోజుల పనిదినాల కల్పన, సిసి రోడ్లు, పశువుల షెడ్స్, ఇంకుడు గుంతలపై సమీక్షించారు. మండల ప్రగతిని మెరుగు పరిచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ ఆర్.గంగాభవాని, టెక్నికల్ అసిస్టెంట్‌లు, సిఒలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

రోగులు, విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - రౌతులపూడి

మాజీ ఎంపిపి ఇటంశెట్టి భాస్కర బాబు కుమారుడు అశోక్ జన్మదిన వేడుకలను యువత ఆధ్వర్యంలో నిర్వహించారు బుధవారం జరిగిన ఈ వేడుకల సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, వసతి గృహ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. 300 మందికి అన్నదానం నిర్వహించారు. కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు.

15న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఈనెల 15వ తేదీన మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఇఇ ప్రభాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33 కెవి మూలపేట ఫీడర్‌పై విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా మూలపేట, అమరవల్లి, రామన్నపాలెం, శీలవారిపాలెం, పొన్నాడ గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

18న కలెక్టరేట్ వద్ద ఆశాల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

2024 ఫిబ్రవరి 9న ఆశా వర్కర్లతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఇచ్చిన మినిట్స్ కాపీలకు జీవోలు, సర్క్యులర్లు ఇవ్వాలని కోరుతూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు యూనియన్ నాయకులు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం డిఎంహెచ్ఒ డాక్టర్ నరసింహనాయక్‌ను ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రమల్ల పద్మ నర్ల ఈశ్వరి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణ చూస్తూ మాతా శిశు మరణాలు తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేయడం లేదన్నారు. సంక్షేమ పథకాలు నిలిపివేయడం, కనీసం ప్రసూతి సెలవులు లేకపోవడం, మెడికల్ లీవ్‌ను ఇవ్వకపోవడం దారుణమన్నారు. 2024 ఫిబ్రవరి 9వ తేదీన ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో అధికారులు ఇచ్చిన మినిట్స్ కాపీలకు జీవోలు, సర్క్యులర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈనెల 18న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో ఆశ వర్కర్లంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సిఎంకు క్లాప్ డ్రైవర్స్ పోస్ట్ కార్డులు

ప్రజాశక్తి - కాకినాడ

సీఎంకు రాసిన పోస్టు కార్డులను చూపుతున్న క్లాప్ డ్రైవర్లు

క్లాప్ వాహన డ్రైవర్స్ బకాయి జీతాల కోసం చేపట్టిన ఆందోళన 20 వ రోజుకు చేరుకుంది. 20వ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి పోస్ట్ కార్డు ద్వారా తమ సమస్యలను రాసి పంపించారు. ఈ ఆందోళన కార్యక్రమాన్ని ఉద్దేశించి పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు మేడిశెట్టి వెంకటరమణ, సిఐటియు నగర కన్వీనర్ మలకా వెంకటరమణ మాట్లాడుతూ క్లాప్ వాహన డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రికి పోస్ట్ కార్డులు రాశారని, ఈ నిరసన ద్వారా నైనా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక మున్సిపల్ అధికారులు క్లాప్ వాహన డ్రైవర్ల సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంతోష్, ఇస్మాయిల్, శివ శంకర్, గంగాధర్, భద్ర, దుర్గాప్రసాద్, ఆర్ వెంకటేష్, శివ, కుమార్, టి శ్రీను, రమణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



600 సెల్‌ఫోన్ల రికవరీ : ఎస్‌పి

ప్రజాశక్తి - కాకినాడ

మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

జిల్లాలో దొంగిలించబడిన, పోగొట్టుకున్న 600 సెల్‌ఫోన్ల రికవరీ చేయడం జరిగిందని, ఇప్పటివరకూ సెల్ ఫోన్ల రికవరీలో ఇదే అత్యధికమని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. బుధవారం పోలీసు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత కొంత కాలంగా మిస్ అయిన, దొంగిలించ బడిన మొబైల్ ఫోన్‌ల కొరకు ప్రత్యేక పర్యవేక్షణలో మోబిట్రాక్ కాకినాడ పోలీసు సాంకేతిక సేవల ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను కాకినాడ ఐటి కోర్ బృందం, జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల క్రైమ్ బృందాలు సంయుక్త కృషితో రికవరీ చేసిన సుమారు రూ.78 లక్షల విలువ గల 600 సెల్ ఫోన్లను సంబంధిత ఫిర్యాదుదారులకు అందించినట్లు చెప్పారు. సెల్ ఫోన్‌ల రికవరీలో విశేషమైన కృషి చేసిన ఐటి. కోర్ టీం ఇన్‌స్పెక్టర్ డి.దుర్గాశేఖర్‌రెడ్డి, ఐటి కోర్ బృంద సభ్యులు, ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్ఐలు, సిఐలు, డిఎస్‌పిలు, సంభందిత సిబ్బందిని ఆయన అభినందించారు. మిస్ అయిన లేదా దొంగలించబడ్డ తమ ఫోన్‌లను తిరిగి పొందడం కోసం బాధితులు మోబిట్రాక్ కాకినాడ పోలీసు సేవలను ఉపయోగించుకోవడానికి 9490617852 నంబర్ వాట్సప్‌కు హాయ్ లేదా హలో అని ఏదైనా మెసేజ్ ఇవ్వాలని తెలిపారు. అలా మెసేజ్ ఇచ్చిన తర్వాత వచ్చిన లింక్ నందు వివరాలు నమోదు చేయడం ద్వారా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఇఐఆర్ వెబ్‌సైట్ https://www.ceir.gov.inలో కూడా దొంగలించబడ్డ ఫోన్‌ల కొరకు ఫిర్యాదు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా దొంగలించబడ్డ తమ విలువైన ఫోన్లను రికవరీ చేసిన ఎస్‌పికి, జిల్లా పోలీసు యంత్రంగానికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి శ్రీరామ కోటేశ్వరరావు, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్ డి.దుర్గాశేఖర్‌రెడ్డి, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ పి.ఈశ్వరుడు పాల్గొన్నారు.

చంద్రబాబుకు సమస్యలను వివరిస్తున్న ఎంఎల్ఎ సత్యప్రభ

గిరిజనుల సమస్యలు పరిష్కరించేలా చర్యలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నియోజకవర్గంలో ఉన్న గిరిజనుల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ సీఎం చంద్రబాబు నాయుడును కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె చంద్రబాబును కలిసి నియోజకవర్గంలో నెలకున్న పలు సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని అంద జేశారు. నియోజకవర్గంలో సుమారు 50 గిరిజన గ్రామాలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో గిరిజనులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. గిరిజనులకు కనీస రహదారులు కానీ, మంచినీటి సౌకర్యం లేకుండా పోయిందన్నారు. ఆసుపత్రిలో సిబ్బంది తక్కువగా ఉండడంతో గిరిజ నులకు వైద్య సేవలు అందడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వంలో గిరిజనుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోలేదని తెలిపారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

న్యుమోనియాపై జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

ప్రశాంతంగా ఊపిరి తీసుకోవాలంటే న్యుమోనియా లక్షణాలను వెంటనే గుర్తించి చికిత్స తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుబ్బారావు అన్నారు. మండలంలోని తాటిపర్తిలో బుధవారం న్యుమోనియాపై ఇంటింటా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాఉ. న్యుమోనియా ఒక ప్రమాదకమైన వ్యాధి అని, ఐదేళ్ల పిల్లల మరణాలకు అతిముఖ్యమైన కారణం ఈవ్యాధి అని తెలిపారు. న్యుమోనియా లక్షణాలు కనిపించిన వెంటనే ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది జి.శ్రీనివారావు, ఎస్‌కెఎ.భాషా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా సుగర్, బిపి వైద్య శిబిరం

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రపంచ షుగర్ వ్యాధి దినోత్సవం సందర్భంగా గురువారం ఉదయం 7 గంటల నుంచి సామర్లకోట లయన్స్ క్లబ్ భవనంలో ఉచిత షుగర్ పరీక్షలు, బిపి పరీక్షలు నిర్వహించనున్నట్లు లయన్స్ అధ్యక్షులు ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని సామర్లకోట, పెద్దాపురం పరిసర ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్, వీర్చొ లేబోేట్రటరీ (రిలీజ్ డైట్ షుగర్) హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు.

ముమ్మరంగా టిడిపి సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నియోజకవర్గంలో టిడిపి సభ్యత్వాలు ముమ్మరంగా సాగుతుందని నియోజకవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి అన్నారు. బుధవారం కరప, కాకినాడ రూరల్ మండలాల్లోని కరప, వాకాడ, వేళంగి, తూరంగి, ఉప్పలంక, హార్బర్‌పేట గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి 104 ఉద్యోగుల వినతులు

ప్రజాశక్తి - యంత్రాంగం

వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

పిఠాపురం సమస్యల పరిష్కారం కోసం మండలంలోని నర్సింగపురంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి 104 ఉద్యోగులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా 104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేట్ల రాంబాబు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కార్మికులకు అనేక హక్కులను కల్పించారని, ఆ హక్కులను నేటి పాలకులు నీరు గార్చుతున్నారని అన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రాఘవ, సంతోష్, దుర్గాదేవి పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలంలోని కాండ్రకోటలో అంబేద్కర్ విగ్రహానికి ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 104 ఉద్యోగులకు ప్రతి నెల క్రమంగా వేతనాలు ఇవ్వాలని, 104 సేవలను రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని, 2020 తర్వాత విధుల్లో చేరిన డ్రైవర్, డిఇఒలకు జీవో 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ తిరిగి చెల్లించాలని, 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చేయాలని, ఉద్యోగులకు మెడికల్ ఇన్సూరెన్స్ చేయించాలని, రోజులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్ కె.వెంకట్రావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. **కరప** స్థానికంగా ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి 104 ఉద్యోగులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బ్రహ్మారావు మాట్లాడుతూ తమ సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రాజ్యాంగం తమకున్న హక్కులను హరిస్తున్న ప్రభుత్వ తీరుకు నిరసనగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు వినతిపత్రం అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు వి.ఇందుమతి, ఉద్యోగులు పాల్గొన్నారు.

పిఠాపురంలో వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

నేరాలు ఘోరాలు

వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరమణ అరెస్టు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట నియోజకవర్గ వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కావలవర్తి వెంకటరమణను పోలీసులు అరెస్టు చేశారు. సోషల్ మీడియాలో కూటమి ప్రభుత్వంపైన, సీఎం, డిప్యూటీ సీఎంపైనా అసభ్యకర, అశ్లీల, అగౌరవకర, అభ్యంతరకర పోస్టులు పెట్టినందుకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిని కోర్టులో హాజరుపర్చగా ఈ నెల 27 వరకు న్యాయమూర్తి రిమాండ్ విధించారని తెలిపారు.

వాహన తనిఖీల్లో నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి గ్రామం మీదుగా సారాను తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారంతో పోలీసులు మంగళవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఒక వాహనంలో 400 లీటర్ల సారా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సారాతోపాటు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సారాను రవాణా చేస్తున్న అల్లు నానాజీని అరెస్టు చేసి కోర్టుకి హాజరుపర్చినట్లు చెప్పారు. సారా తయారు చేస్తున్న గుమ్మరేగుల గ్రామానికి చెందిన నిండుకుండల రమణ పరారీలో ఉన్నాడని, తొందర్లోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు.

1200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఏలేశ్వరం మండలం కొండ తిమ్మాపురం గ్రామంలో సారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ శివప్రసాద్ మాట్లాడుతూ సారా కాచిన, అమ్మిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సారా తయారీదారులపై నిరంతర నిఘా కొనసాగుతుందని, అలాగే మద్యాన్ని అక్రమంగా విక్రయాలు చేసే వారిపైనా నిఘా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీలు ధ్వంసం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని ముమ్మిడివరపోడు గ్రామ శివారులో సారా బట్టీలను బుధవారం పోలీసులు ధ్వంసం చేశారు. ముందస్తుగా వచ్చిన సమాచారంతో పోలీసు వాసంశెట్టి అప్పన్న నిర్వహిస్తున్న సారా బట్టీపై దాడి చేసినట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

ప్రజాశక్తి - జగ్గంపేట

హత్య కేసులో నిందితుడికి కోర్టు జీవిత ఖైదీ శిక్షను విధించినట్లు సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఈ కేసుకు సంబంధించిన వివరాలను సిఐ వివరించారు. 2013 ఏప్రిల్‌లో మండలంలోని సీతానగరంలో వానశెట్టి సింహాచలం, నైనపు శ్రీను పక్క పక్కనే కల్లు వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. అయితే సింహాచలం భార్యతో శ్రీను అక్రమ సంబంధం పెట్టుకోవడంతో దీనికి సహకరించిన స్థానిక బత్తిన భవానిని, ఆమె ఇంటికి వెళ్లి కల్లుగీత కత్తితో దాడి చేయగా భవాని అక్కడికక్కడే మృతి చెందింది. అదేరోజు రాత్రి సీతానగరంలో కల్లు అమ్ముతున్న శ్రీను దగ్గరికి వెళ్లి అతనిపైన కత్తితో దాడి చేయగా శ్రీను జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు నమోదు చేసిన కేసు విచారణ చేసిన కోర్టు వానిశెట్టి సింహాచలంకు జీవిత ఖైదీ శిక్షతోపాటు, రూ.వెయ్యి జరిమానాను విధించినట్లు ఆయన తెలిపారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవి ఎల్.అర్జునరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని కొండపల్లి, మరలావ, తూర్పు పాకల గ్రామాల్లోనూ, జగ్గంపేట మండలం మల్లేశం గ్రామంలో నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 5 కేసులు నమోదు చేశామన్నారు. అలాగే పాత సారా కేసులో ముద్దాయిలను మెజిస్ట్రేట్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ పి.చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా నకిలీ టీ పౌడర్ సీజ్

ప్రజాశక్తి - గోకవరం

31 బస్తాల్లో ఉన్న 1,250 కేజీల నకిలీ టీ పౌడర్, వాటి మెటీరియల్‌ను రంపయర్రంపాలెం పోలీసులు బుధవారం సీజ్ చేశారు. రంపయర్రంపాలెం శ్రీ దుర్గాగణపతి రైస్ మిల్లులో నకిలీ టీ పౌడర్ తయారు చేస్తున్నారని పోలీసులకు అందిన సమాచారం మేరకు గోకవరం ఎస్ఐ పవన్ కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది ఆ ప్రదేశంలో తనిఖీలు చేపట్టారు. 31 బస్తాల్లో నకిలీ టీ పౌడర్, తయారీకి ఉపయోగించే మెటీరియల్ క్రీమ్ కలర్ బ్యాగులు 15, బూడిద రంగు బ్యాగులు14, బట్ట సోడా 2 బ్యాగులు సీజ్ చేశారు. టీ పౌడర్ శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించామని, నకిలీదని తేలితే తయారీదారులపై కఠిన చర్యలు తప్పవన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని కొత్తూరు రోడ్డులో దుర్గమ్మ గుడి వద్ద మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు బుధవారం తెలిపారు. పట్టణం లోని కుమ్మర వీధికి చెందిన దంతినాడ వినోద్ కుమార్ రామచంద్రపురం కొత్తూరు రోడ్డులో దుర్గమ్మ గుడి వద్ద మద్యం విక్రయిస్తున్నాడు. ఎక్సైజ్ అధికారులు దాడి చేసి అతని వద్ద నుంచి 18 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడులో ఎక్సైజ్ ఎస్ఐ కె.సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు బెల్ట్ షాపులపై దాడి

ప్రజాశక్తి - ఆలమూరు

అనధికారికంగా నిర్వహిస్తున్న మూడు బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 33 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కాజులూరు నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కాజులూరు గ్రంథాలయ అధికారి ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువారం బాలల దినోత్సవం, శుక్రవారం మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యత, శనివారం గ్రంథాలయ ఉద్యమకారుల జీవిత విశేషాలు స్మరించుట, ఆదివారం కవి సమ్మేళనం, సెమినార్, రచయితల సందేశాలు ఉంటాయన్నారు. సోమవారం విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖనం పోటీలు, మంగళవారం మహిళల చట్టాలు, దిశా చట్టం, మహిళ సాధికారికతపై చర్చలు, బుధవారం డిజిటల్ గ్రంథాలయంపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. **తుని** స్థానిక గ్రంథాలయంలో జరిగే వారోత్సవాల వివరాలను గ్రంథాలయ అధికారి జి.రంగనాథరావు ఓ ప్రకటనలో వెల్లడించారు. 14న బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాసరచన పోటీలు, 15న పుస్తక ప్రదర్శన, 16న చిత్రలేఖనం, 17న చిత్రలేఖనం జూనియర్స్, 18న క్విజ్ పోటీలు, 19న వక్తృత్వ పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. 20వ తేదీ సాయంత్రం 6 గంటలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు జరుగుతాయని తెలిపారు. **సామర్లకోట** గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. కమిషనర్ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న విలువైన పుస్తకాలను అన్ని వయసుల ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. గ్రంథాలయ అధికారి రత్నమణి మాట్లాడుతూ 16వ తేదీన విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 17వ తేదీన చిత్రాలేఖన పోటీలు, 18న వక్తృత్వ పోటీలు, 19న మహిళా దినోత్సవ కార్యక్రమాలు, 20న వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ రాంబాబు, పలువురు ఉపాధ్యాయులు, పాఠకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పిఠాపురం

ఎన్నికల ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు దువ్వా శేషబాబ్జి డిమాండ్ చేశారు. ప్రజా పోరు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం, కోటగుమ్మం సెంటర్‌లో కరపత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి పార్టీలు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు తగ్గిస్తామని అన్నారని, విద్యుత్ భారాలు తగ్గించకపోగా సర్దుబాటు పేరుతో మరిన్ని భారాలను వేస్తున్నారని అన్నారు. ఉచితంగా ఇసుకను ఇస్తామన్నా హామీ అధికారంలోకి వచ్చి ఐదు నెలల గడుస్తున్న ఆ హామీని అమలు చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కుంచే చిన్న, కోనేటి రాజు, కె.నాగేశ్వరరావు, కె.మణి, కె.విశ్వనాథం, జి.వీరబాబు, రాజు, నందీశ్వరరావు, మణికంఠ, స్టాలిన్, సత్తిబాబు, సత్యనారాయణ, రాజబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

ప్రజాపోరులో మాట్లాడుతున్న సిపిఎం నేత శేషబాబ్జి

పొలంబడితో రైతుకు ప్రయోజనాలు

ప్రజాశక్తి - కరప

రైతులకు పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచేందుకు పొలంబడి కార్యక్రమం దోహదం చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొరుపల్లి గ్రామంలో పొలంబడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ పంటకాలంలో 14 వారాలు పొలంబడి కార్యక్రమం ప్రతి వారంలో గురువారం రోజున నిర్వహించడం జరుగుతుందన్నారు. తక్కువ పురుగుమందులు, ఎరువులు వాడి నాణ్యతను పెంచేలా రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ కె.బాబురావు, మండల ఎఒ ఎవి.రాజేష్ వ్యవసాయ విస్తరణ అధికారులు నోవా, శ్రీరాములు, ప్రశాంత్, రైతులు కృష్ణ, రాంబాబు, అప్పలస్వామి, పెంకే వీర వెంకట సత్యానారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కొనసాగుతున్న రీ సర్వే గ్రామసభలు

ప్రజాశక్తి - పెద్దాపురం, సామర్లకోట

సామర్లకోట మండలంలోని గుడివాడ గ్రామంలో రీ సర్వే గ్రామ సభను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కాంతారావు పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కనపర్తి సీమ దొర, మండల సర్వేయర్ సామోరు, గ్రామ సర్వేయర్ ఏసుబాబు, విఆర్ఒ సిహెచ్.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి గుడాల శ్యాంప్రసాద్, పాల్గొన్నారు. సామర్లకోట మండలంలోని కాపవరం గ్రామంలో రీ సర్వే గ్రామసభ జరిగింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. గ్రామ సభలో 31 అర్జీలు వచ్చాయని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయవరపు సత్యనా రాయణ, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, పాల్గొన్నారు.

కష్టపడే వారికి టిడిపిలో తగిన గుర్తింపు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

నిబద్ధతతో కష్టపడి పని చేసే వారికి టిడిపిలో తగిన గుర్తింపు ఉంటుందని ఎపి శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడుతున్న తనకు పార్టీ అధిష్టానం ఇప్పటికే పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులుగా నియమించిందని, కూటమి ప్రభుత్వంలో తగిన గుర్తింపుగా శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అవకాశం ఇచ్చిందన్నారు. తనకు సముచిత స్థానం కల్పించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంఎల్‌ఎలు నిమ్మకాయల చినరాజప్ప, పంతం నానాజీ, వనమాడి కొండబాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంఎల్‌ఎ దాట్ల, టేకుమూడికి అభినందనలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

కేక్‌ను కట్ చేస్తున్న నాయకులు

ఎపి అసెంబ్లీ విప్‌గా ఎంపికైన ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన టేకుమూడి లక్ష్మణ రావును పలువురు అభినందనలు తెలిపారు. పోలేకుర్రు గ్రామ కమిటీ అధ్యక్షులు వడ్లమూరి సతీష్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు జక్కల ప్రసాద్ స్వగృహం వద్ద కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయలు మూర్తి, ఎరుపల్లి వీరన్న, దున్న సింహాద్రమ్మ, దడాల మోహన్ రావు, దున్న మహేంద్ర, బండి లక్ష్మణ బాబు, కడలి సింహాచలం పాల్గొన్నారు. అలాగే ముమ్మిడివరం ఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అసెంబ్లీ విప్‌గా సుబ్బరాజు పదవి పొందడం హర్షనీయమన్నారు. అనంతరం టిడిపి సోషల్ మీడియా నాయకులు దాసరి వేణుగోపాల్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు అత్తిలి బాబురావు, రాయుడు గంగాధర్, మాజీ సర్పంచ్‌లు వాసంశెట్టి శ్రీనివాస్, కాలా సూరిబాబు, ప్రముఖ వ్యాపారవేత్త తోటరాజు, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పైల

ప్రజాశక్తి - రౌతులపూడి

సాంబశివరావు

జిల్లా బీసీ సెల్ అధ్యక్షులుగా పనిచేస్తున్న శంఖవరం మాజీ ఎంపిపి, రౌతులపూడి మాజీ సర్పంచ్‌గా పనిచేసిన పైలా సాంబశివరావు కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. 1994 నుంచి టిడిపిలో పని చేస్తున్నారు. 2016 వరకూ రౌతులపూడి మండల టిడిపి అధ్యక్షులుగా పని చేశారు. మాజీ ఎంఎల్‌ఎలు పర్వత బాపనమ్మ, పర్వత సుబ్బారావు. పర్వత చిట్టిబాబు విజయానికి ఎంతగానో కృషి చేశారు. 2019 నుంచి 2022 మధ్యలో డిసిసిబి మాజీ ఛైర్మన్ వరుపుల రాజా అడుగుజాడల్లో నడుస్తూ వచ్చారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వరుపుల సత్యప్రభ విజయానికి కృషి చేశారు. ఈ నేపథ్యంలోనే పార్టీ అధిష్టానం ఆయనను కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించింది. ఈ నియామకం పట్ల టిడిపి మండల అధ్యక్షులు తమరాల సత్యనారాయణ. కోసూరి కృష్ణవర్మ, పల్లా సూరిబాబు, బలరామపురం ఎంపిటిసి సోమరౌతు రవి, వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

స్థానిక పెద్ద బజారులో బుధవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 48వ బ్రాంచ్‌ను దేవాదాయ ధర్మాదాయ శాఖ డిసి రమేష్ బాబు ప్రారంభించారు. తొలుత డిసి రిబ్బన్ కట్ చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా విజయవాడ జోన్ జోనల్ మేనేజర్ వైద్యనాథ్ మాట్లాడుతూ పిఠాపురంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభించాలన్న కల నేటితో నెరవేరిందన్నారు. నేటి నుంచి తమ బ్యాంకు ద్వార వివిధ రకాల సేవలు అందిస్తామని అన్నారు. పదేళ్లు దాటిని వారికి ఎస్‌బి ఇవా అకౌంట్‌ను ప్రారంభిస్తామని చెప్పారు. గత మూడు సంవత్సరాలుగా బ్యాంకింగ్ రంగంలో రుణాలు ఇవ్వడంలో తమ బ్యాంకు అగ్రగామిగా ఉందన్నారు. తక్కువ వడ్డీతో గృహ, వాహన, బంగారంపై రుణాలు అందజేస్తామన్నారు. పిఠాపురం చుట్టుపక్కల ప్రజలందరూ బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలన్నారు. అనంతరం డిసి రమేష్‌బాబు మాట్లాడుతూ మహారాష్ట్ర భక్తులతో ఇక్కడ దేవాలయాలు కిటకిటలాడుతున్నాయని, సదరు బ్యాంకు మహారాష్ట్ర మూలాల నుంచి రావడంతో శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ నందిని, ఇఒ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

తక్షణమే కూటమి ప్రభుత్వం వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని వైసిపి నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలో రాచపల్లి గ్రామంలో పలు కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు వాలంటీర్లను కొనసాగిస్తామని, రాజీనామాలు చేయొద్దని పిలుపునిచ్చిన కూటమి పార్టీల నాయకులు నేడు అధికారంలోకి వచ్చాక వాలంటీర్లను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు వాలంటీర్లకు ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన

ప్రజాశక్తి - సామర్లకోట

ఉప్పు సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం పిఠాపురం రోడ్డులోని ఉప్పు సీతారామయ్య సత్రం వద్ద బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య పాల్గొన్నారు. తొలుత ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యులు ఉప్పు సత్యనారాయణ దంపతులు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేపట్టారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య ప్రారంభించారు. సామర్లకోట, జల్లూరు పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు వన సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి ఉప్పు కోదండం, వైసిపి కార్మిక విభాగం రాష్ట్ర నాయకుడు దవులూరి సుబ్బారావు, భారతమాత సేవా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర, లైన్స్ క్లబ్ నాయకుడు గుండు శంకర్రావు, మాజీ కౌన్సిలర్ కాపుగంటి పైడిరత్నం, దూది రాజబాబు పాల్గొన్నారు.

ఆదిత్యలో 4 రోజుల వర్క్‌షాప్ ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి

అదిత్య విశ్వవిద్యాలయం కాంప్యూటర్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో ఆధునిక వెబ్ టెక్నాలజీలపై 4 రోజుల సమగ్ర వర్క్‌షాప్ బుధవారం ప్రారంభం అయింది. 'రియాక్ట్ అండ్ నోడ్.జెఎస్ ఆధునిక వెబ్ అప్లికేషన్స్ నిర్మాణం' అనే అంశంపై నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ఎంసిఎ తృతీయ సెమిస్టర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎంబి.శ్రీనివాస్, ప్రో వైస్ ఛాన్సలర్ (అకడమిక్స్) డాక్టర్ రమాశ్రీ, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ సంజయ్ డోలా, విభాగాధిపతి డాక్టర్ ఎం. వంశీకృష్ణ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఆధునిక వెబ్ టెక్నాలజీతో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఆకాంక్షించారు.

నెహ్రూకు గణిత చదరంతో శుభాకాంక్షలు

ప్రజాశక్తి - సామర్లకోట

మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పుట్టిన తేదీని మొదటి వరుసలో ఉపయోగించి గణిత అవధాని తోటకూర సాయి రామకృష్ణ మ్యాజిక్ స్క్వేర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. మ్యాజిక్ టోటల్‌గా 69 వస్తుందని, నాలుగు అడ్డ వరుసలు, నాలుగు నిలువు వరుసలు, రెండు కర్ణంలలో సంఖ్యల కూడగా 69 రావడం విశేషం. అదేవిధంగా చిన్ని చదరల్లో నాలుగు సంఖ్యల మొత్తం కూడా 69 రావడం, వాడిన సంఖ్య వాడక పోవడం దీని ప్రత్యేకత.

ఆదిత్యలో శేషారెడ్డి పూజలు

ప్రజాశక్తి - గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆవరణలో సహస్ర చండీ యాగం జరిగింది. విద్యార్థులు రాసిన సాయి కోటి రచన పుస్తకాలు స్థూపంలో ఉంచారు. చతుర్వేద పారాయణ పురస్సర, రుద్రాభిషేకం, చండీహోమం, చండీ పారాయణ, నీరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాలతో ఆదిత్య ప్రాంగణం వేద ఘోషతో మర్మోగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి దంపతులు, డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి దంపతులు, ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు.

యానాం వార్తలు

వ్యాపారస్తులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ పరిధిలో ఉన్న వ్యాపార వర్గాలు తూనికలు, కొలతలశాఖ నిబంధనలు తప్పకుండా పాటించాలని తూనికలు-కొలతల శాఖ డిప్యూటీ తహశీల్దార్ గణేషన్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. కిరాణా దుకాణాలు, డిపార్ట్మెంటల్ స్టోర్స్, బేకరీలు, స్వీట్స్ తదితర సంస్థలు తాము ప్యాకేజీ చేస్తున్న వస్తువులకు సంబంధించిన పూర్తి వివరాలను తప్పనిసరిగా ముద్రించాలన్నారు. ప్యాకేజీ చేయబడిన వస్తువులను విక్రయించే వ్యాపారులు తమ వివరాలను యానాంలో తూనికలు-కొలతల శాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని, ఆనంతరం పొందిన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు షాప్‌ల వద్ద స్పష్టంగా కనిపించే విధంగా పెట్టాలన్నారు. మద్యం బాటిళ్లను సైతం ఎంఆర్‌పి ధరలకే విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. .

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గంలో 11 కెవి విద్యుత్ వైర్ల నిర్వహణ, విద్యుత్ లైన్‌ల పై ఉన్న చెట్లను తొలగించడం కొరకు గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సుభద్ర నగర్, కురసాంపేట, న్యూ రాజీవ్ నగర్, పరంపేట, దొమ్మేటి పేట, ఇండస్ట్రియల్ ఏరియా, ధరియాల తిప్ప, ఆర్ఐటి రోడ్డు, గిరియంపేట, సావిత్రి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాకినాడ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ రూపొందించిన 10వ తరగతి జీవశాస్త్ర స్టడీ మెటీరియల్ పుస్తకాన్ని బుధవారం డిఇఒ పి.రమేష్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు.

పేరు మార్పు

ఇందుమూలముగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, **కోలా శ్రీనివాసు, S/o. కోలా సుబ్బారావు** (Old Name) డోర్ నెంబరు: 44-15-8, నాగరాజుపేట, జగన్నాధపురం, కాకినాడ, కాకినాడ అర్బన్, కాకినాడ జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా, పిన్: 533002, అను నేను నా పాత పేరును అనగా **కోలా శ్రీనివాసు, S/o. కోలా సుబ్బారావు** అను పాత పేరును (Old Name) కొత్త పేరుకు (New Name) అనగా **పంతాడ శ్రీనివాసు, S/o. పంతాడ రామకృష్ణ** గా మార్చుకొనుచున్నాను అని తెలియచేస్తూ ఇక నుండి నా పేరు **పంతాడ శ్రీనివాసు, S/o. పంతాడ రామకృష్ణ** గా పరిగణించవలసినదిగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేస్తున్నాను.

పాస్‌పోర్టు పడిపోయినది

కాకినాడ జిల్లా, పెద్దాపురం పట్టణానికి చెందిన ముమ్మారెడ్డి రామకృష్ణ, తండ్రి: (లేటు) కనకయ్యకు చెందిన (డోర్ నెం. 19-1-412/సి, సుధాకాలనీ) పాస్‌పోర్టు నెం. బి0715327 గల పాస్‌పోర్టు ఈనెల 10వ తేదీన పెద్దాపురం మెయిన్‌రోడ్‌లో జిరాక్స్ షాప్ నుంచి జిరాక్స్ తీయించుకుని వచ్చుచుండగా మార్గ మధ్యలో ముమ్మారెడ్డి రామకృష్ణకి చెందిన ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

ముమ్మారెడ్డి రామకృష్ణ
తండ్రి: (లేటు) కనకయ్య
డోర్ నెం. 19-1-412/సి, సుధాకాలనీ
పెద్దాపురం, సెల్: 86883 97834

లింక్ దస్తావేజు పోయినది

కాంద్రేగుల రాధాకృష్ణ, S/o. ధర్మరాజు, డో.నెం. 79-1-3, రామాలయం దగ్గర, జె.ఎన్.రోడ్డు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **ఒరిజినల్ లింక్ దస్తావేజు నెం. 702/1967, Dt. 06-03-1967** రాజమండ్రి సబ్ రిజిష్టర్ ఆఫీస్‌లో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింక్ దస్తావేజు ది. 02-11-2024వ తేదీన నా ఇంటి నుండి రాజమండ్రి దేవీచౌక్ సెంటర్ నందు జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా రాజమండ్రి దేవీచౌక్ వద్ద పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను.

కాంద్రేగుల రాధాకృష్ణ
డో.నెం. 79-1-3, మల్లిఖార్జున నగర్,
జె.ఎన్.రోడ్డు, రాజమండ్రి, తూ॥గో॥జిల్లా
సెల్: 94905 99603

పాస్‌పోర్ట్ పడిపోయినది

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, అల్లవరం మండలం, కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన కొండేపూడి రవికుమార్, S/o. సత్యనారాయణకు చెందిన పాస్‌పోర్ట్ పడిపోయినది. పాస్‌పోర్ట్ నెంబర్ **B 8145729.** ది. 22-10-2024 తేదీన ఇంటి వద్ద నుండి అమలాపురం పాస్ పోర్ట్ తీసుకొని జిరాక్స్ నిమిత్తం వెళ్ళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినది. దొరికిన వారు క్రింది అడ్రస్ అందజేయగలరు.

కొండేపూడి రవికుమార్
S/o. సత్యనారాయణ
డో.నెం. 3-220, అంబేద్కర్ నగర్,
కొమరగిరిపట్నం, అల్లవరం మండలం
సెల్: 7989888836

ప్రకటన

నా క్లయింట్, తూర్పు గోదావరి జిల్లా, నిడదవోలు మండలం, తాడిమళ్ళ గ్రామ కాపురస్తులు కీ॥శే॥ పెనుగొండ రామారావు గారి కుమారుడు పెనుగొండ వెంకటేశ్వరరావు గారు నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా
నా క్లయింట్ ది.23.10.2024వ తేదీన, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, గౌతమీ లైబ్రరీ వీధి, విజయలక్ష్మీ రెసిడెన్సీ 4వ ఫ్లోర్, ఫ్లాట్ నెం.404 కాపురస్తులు అద్దేపల్లి చిన వెంకట్రాజు గారి కుమారుడు అద్దేపల్లి సత్యవంత్ గారి నుండి ఈ దిగువ షెడ్యూల్ దాఖలు ఆస్థిని కొనుగోలు చేసి క్రియ అగ్రిమెంట్ వ్రాయించుకొని ఉన్నారు. కాబట్టి ఈ షెడ్యూలు ఆస్థిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరములు గానీ క్లెయిములు గానీ వున్న యెడల నా క్లయింట్‌కు గానీ, నాకు గానీ ఈ తేదీ నుండి వారము రోజులలోగా లిఖిత పూర్వకముగా తెలియజేయవలెను. ఏవిధమైన అభ్యంతరములు రానియెడల నా క్లయింట్, సత్యవంత్ గారి నుండి షెడ్యూల్ ఆస్థికి రిజిష్టర్డ్ క్రయ దస్తావేజు చేయించుకోగలరనియు, గడువు దాటిన తదుపరి వచ్చే క్లయిమ్‌లకు, అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యత వహించబోరని ఈ ప్రకటన మూలముగా తెలియజేయడమైనది.
షెడ్యూల్: తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం జిల్లా రిజిష్టార్ వారి ఆఫీసులో చేరిన రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలోని, రాజమహేంద్రవరం పట్టణం తాలూకు, ఆలపాటి వారి వీధి, డోర్ నెం. 29-5-6/2రు గల డాబా యిల్లు అందలి స్థలం 96.1/2 చ॥గ॥లు మూడు ప్రతులుగా ఉండి ఉన్న ఆస్థికి కొలతలు, **హద్దులు:**
1వ ప్రతి: చ॥గ॥ 65.1/2 లులో గల డాబా యింటికి హద్దులు:
తూర్పు: పెనుగొండ సూర్యకుమారి గారి షాపులు: అ॥ 45.5 లు, **దక్షిణం:** నా తాలూకా ఆస్థి: అ॥ 13.4 లు, **పడమర:** పెనుగొండ రామకృష్ణ గారి జాయింట్ గోడ : అ॥ 45.5 లు, **ఉత్తరం:** రాజవీధి మరియు పెనుగొండ సూర్యకుమారి గారి షాపులు : అ॥ 12.9 లు
2వ ప్రతి: చ॥గ॥ 20.1/2లుకు హద్దులు:
తూర్పు: 3వ ప్రతి కొంత, పి.సూర్యకుమారి గారి షాపు : అ॥ 33.9 లు, **దక్షిణం:** పి.సూర్యకుమారి గారి దారి మార్గం : అ॥ 4 లు, **పడమర:** 1వ ప్రతి యిల్లు : అ॥ 33.9 లు, **ఉత్తరం:** పెనుగొండ సూర్యకుమారి గారి షాపులు : అ॥ 4 లు.
3వ ప్రతి: చ॥గ॥ 10.1/2లుకు హద్దులు:
తూర్పు: వీధి : అ॥ 8.9 లు, **దక్షిణం:** పి.సూర్యకుమారి గార్కి మాకు గల ఆస్థి : అ॥ 10.9 లు, **పడమర:** 2వ ప్రతి యిల్లు : అ॥ 8.9 లు, **ఉత్తరం:** పెనుగొండ సూర్యకుమారి గారి షాపులు : అ॥ 11 లు.
4వ ప్రతి: చ॥గ॥ 33.22 లులో గల రేకుల షెడ్డుకు హద్దులు:
తూర్పు: 4వ ప్రతి కొంత, పి.సూర్యకుమారి గారి ఆస్థి కొంత : అ॥ 26.0 లు, **దక్షిణం:** వి.ఎల్.ఎన్.వెంకట్రామయ్య గారి తాలూకూ స్థలం : అ॥ 10.0 లు, **పడమర:** పి.రామకృష్ణ గారి ఆస్థి : అ॥ 26.0 లు, **ఉత్తరం:** నా తాలూకూ ఆస్థి మరియు దారిమార్గం : అ॥ 13.0 లు
యీ హద్దుల మధ్య చ॥గ॥ 33.22 లు స్థలం.
5వ ప్రతి: చ॥గ॥ 5.83 లులో గల డాబా యింటికి హద్దులు:
తూర్పు: రోడ్డు (పి.సూర్యకుమారి గార్కి మాకు గల ఉమ్మడి దారి మార్గం) అ॥ 3.6 లు, **దక్షిణం:** పి.సూర్యకుమారి గార్కి మాకు గల ఉమ్మడి ఆస్థి: అ॥ 15.0 లు, **పడమర:** 4వ ప్రతి : అ॥ 3.6 లు, **ఉత్తరం:** నా తాలూకూ ఆస్థి కొంత : అ॥ 15.0 లు
యీ హద్దుల మధ్య చ॥గ॥ 5.83 లు స్థలం.

నిడదవోలు
09-11-2024

ఎస్.వి.వి.సూర్యనారాయణ
అడ్వకేట్, B.Sc, BL
ఉనకరమిల్లి, నిడదవోలు మండలం
సెల్: 94409 33563

జనరల్ నోటీసు

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు
జి.డబ్ల్యు.ఓ.పి. నెం. 62 / 2024
బిట్వీన్:
నీలి అలియాస్ మద్దా రోజా భారతి ...పిటీషనర్
ఎదిరి
నిల్ ...రెస్పాండెంట్

[illegible]

షెడ్యూలు: [illegible]

వాయిదా తేది: 22-11-2024
యన్. మహేశ్వరరావు
పిటీషనరు తరపు న్యాయవాది, గుంటూరు. సెల్: 9963392377

జనరల్ నోటీసు

మహారాజశ్రీ రాజమహేంద్రవరం 8వ అదనపు జిల్లా జడ్జివారి కోర్టు
జి.డబ్ల్యు.ఓ.పి. నెం. 61 / 2024
బిట్వీన్:
ఆవుల పద్మ ...పిటీషనర్
ఎదిరి
నిల్ ...రెస్పాండెంట్

[illegible]

షెడ్యూలు: [illegible]

వాయిదా తేది: 22-11-2024
యన్. మహేశ్వరరావు
పిటీషనరు తరపు న్యాయవాది, గుంటూరు. సెల్: 9963392377